# కాలమ్‌దాటనికథలు

## చందా

"బాబూ.... అన్నం తిని రెండ్రోజులైంది...." గబగబా వెళ్తున్న రామానికి బిచ్చగాడి దయనీయమైన ఆకలి అభ్యర్థన విపరీతమైన చిరాకుని తెప్పించింది "జరుగు పక్కకి...." అసహనంగా అరిచాడు

"బాబూ .. ఒక్క పది పైసలు"

రామం కోపం తారాస్థాయినందుకుంది. "తప్పుకో"



గొంగళి పురుగుని చీదరించుకున్నట్లు అతన్ని చీదరించుకుని ముందుకు బయల్దేరాడు రామం.

అతను ఆ సందు చివరికి వచ్చే సరికి దూరంగా వస్తున్న పెద్దవూరేగింపు కనబడింది.

సినిమా నటులు కొందరు పేదలకోసం నిధిని సేకరించడానికి బయల్దేర తీసిన రాలీ అది!

వాళ్ళు రోడ్డు మీదపోతుంటే జనాలు వేలం వెర్రిగా పరుగెత్తుకెళ్ళి మరీ వాళ్ళకి చందాలు ఇస్తున్నారు.

అంతా కోలాహలం....!

రామం ముందుకు దూసుకుపోయాడు.... అభిమన్యుడిలా జనంలోంచి దూసుకెళ్ళి తన అభిమాన నటి జోలెలో జేబులో వున్న డబ్బంతటినీ తీసి వేశాడు. అంతటితో ఆగకుండా చేతినున్న వాచీకూడా తీసి వేశాడు.

—పెమ్మరాజు సంధ్యారాణి

## చెల్లని రూపాయి

సుజాత పోస్టల్ క్లర్కు. ఆ రోజు శనివారం కావటాన కస్టమర్స్ ఎక్కువగా వస్తున్నారు. ఫ్యూసుచేత కాఫీ తెప్పిద్దామని బ్యాగ్ తెరిచి అందులో ఉన్న రూపాయి తీసింది. చెల్లని రూపాయి. రెండురోజుల్నించి ఎంత ప్రయత్నించినా చెట్టు వదలని భేతాళుడిలా ఇది తనను వదలటంలేదు. దీన్ని ఎలాగైనాసరే ఈ రోజు మార్చాలి అని గట్టిగా తీర్మానించుకుంది.

"ఎక్స్యూజ్‌మీ మేడమ్." ఎవరో యువకుడు నీటుగా, దర్జాగా ఉన్నాడు.

"యస్" చేయి చాపుతూ అడిగింది.

"రెండు ఇన్‌లాండ్ లెటర్స్ యివ్వండి" రెండు రూపాయల కాగితం ముందుకు తోశాడు. సుజాత క్యాష్‌బాక్స్‌లో చూసింది. రూపాయి కాగితాలు లేవు.

"చిల్లర లేదండి. మీ దగ్గర చిల్లర ఉంటే యివ్వండి"

"సారీ నా దగ్గర కూడా లేదండి" నవ్వి చూసి చెప్పాడు.

మెరుపులాంటి ఆలోచన సుజాత బుర్రలో ఫ్లాష్‌లాగా వెలిగింది. తన రూపాయి యిస్తే తీసుకుంటాడా?తీసుకోక ఏంచేస్తాడు? ఆడపిల్ల యిస్తే మొహమాటానికైనా తీసుకొని తీరతాడు.తన ఆలోచనకు తనే మెచ్చుకుంది.

"మీకభ్యంతరం లేకపోతే ఈ రూపాయి తీసుకోండి. ఎవరో యిచ్చారు నేను చూసుకోలేదు" చిన్న అబద్ధం ఆడింది. తన బుర్ర చురుగ్గా పని చేస్తుంది.

"అలాగే యివ్వండి."రూపాయి.మిగతా చిల్లర తీసుకొని "థాంక్స్"చెప్పి బయటకు నడిచాడు!

సాయంత్రం ఐదు అవగానే క్యాష్ బాక్సునుంచి రూపాయి తీసుకొని బ్యాగ్‌లో వేసుకుంది. సెంటర్‌కి రాగానే కాఫీ తాగాలనిపించి దగ్గరలో ఉన్న హోటల్లోకి వెళ్ళింది.పొద్దుట్నుంచిఏమీ తినకపోవటాన టిఫిన్ కూడా చేసి బిల్ తీసుకొని కౌంటర్లో బిల్. క్యాష్ ఇచ్చింది. బిల్‌పోగా మిగిలిన చిల్లర తీసుకొని బ్యాగ్‌లో వేసుకుంటూ చూసింది. రూపాయి. తన రూపాయే. తలెత్తి కౌంటర్లో చూసింది. అతను నవ్వుతున్నాడు చిన్నగా. తనూ చిన్నగా మందహాసం చేసి బయటకు నడిచింద.

—సారిత

## పరిష్కారం

"ఏం పాపా చేపలు కొంటావా?" అని అడిగింది ఒక ముసలిది, 12 ఏళ్ళ అమ్మాయిని. 'అవును కొంటాను'అన్నట్లు తల వూపింది ఆ అమ్మాయి.

"ఎంతకి కొంటావు! ఎలాంటి చేపలు కావాలి?" అని అడిగింది ఆ ముసలిది.

"మా అమ్మగారు ఈ పది రూపాయలకి తెమ్మన్నారు" అని నోటు చూపించింది ఆ అమ్మాయి.



"నేను మంచివి కొననా?" అని ఆ ముసలావిడ అడగగానే. ఆ పాపకు వాళ్ళమ్మ ఎవరైనా పెద్దవారిని అడిగి కొనమని చెప్పటం గుర్తొచ్చి, "అలాగే కొను" అని ఆ ముసలావిడకు పది రూపాయల నోటు ఇచ్చింది ఆ అమ్మాయి.

"బాబూ....ఈ చేప ఎంత? ఆ పెద్ద చేప ఎలాగ?" అని రెండు మూడు రకాల చేపలను అడిగింది ఆ ముసలిది.

"తొందరగా తీసుకో మామ్మా ఇంటికి వెళ్ళిపోవాలి" అని ఆ అమ్మాయి హెచ్చరించింది. "ఉండుపిల్లా.... నేను కొనుక్కోవాలి ముందు. నాకూ తొందరగానే వుంది." అని కసిరి,"బాబూ....ఈ పెద్దచేప ఎంతకిస్తావు" అని అడిగింది. ఆ చేపలవాడు పన్నెండు రూపాయలు అని చెప్పాడు."...అయితే నా దగర పదే ఉన్నాయే!"అన్నీ'ఉండు ఇంకొక రూపాయి ఇస్తాను. మొత్తం పదకొండు రూపాయలకు ఇయ్యి" అని బేరమాడింది ఆ ముసలిది. అలాగే అన్నాడు దుకాణందారు. ముసలిదాని దగ్గర పదకొండు రూపాయలు తీసికొని. ఆ అబ్బాయి. ఏడుపు ముఖంతో చూస్తున్న ఆ అమ్మాయి సంచిలో ఆ చేపను వేసేశాడు. "అయ్యో బాబూ ఆ చేప నాది. నేనిచ్చాను డబ్బులు" అని అరిచింది ముసలిది. "నోరు ముయ్యి పోలీస్‌లను పిలిస్తే. నీ అసలు రంగు బైట పడిపోద్ది జాగర్త!" అని వారిద్దరి సంభాషణ విన్న చేపలవాడు అన్నాడు. ఆ దొంగ ముసలిది తల వంచుకొని వెళ్ళిపోయింది.

—ఎస్. పద్మజ